ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపుటి : 3 సంచిక :128 బుధవారం మార్చి 4 2026, పేజీలు - 4 వెల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH



# యుద్ధం ఎవరికీ మేలుచేయదు..

-శాంతి మార్గమే పరిష్కారం
-ప్రపంచాన్ని కలవరపెడుతున్న దేశాల మధ్య ఉద్రిక్తతలు
-ఉద్రిక్తతల అగ్ని చెలరేగితే ప్రపంచానికే ముప్పు
-అమాయకుల ప్రాణాలు బలి
-ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం
-ఆయుధాల కంటే సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం



మార్చి 3 (మనప్రజాప్రతినిధి): ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో దేశాల మధ్య ఉద్రిక్తతలు ప్రమాదకర దశకు చేరుతున్నాయి. ఒక దేశం తీసుకునే కఠిన నిర్ణయం మరొక దేశం ప్రతిస్పందనకు దారి తీస్తూ, పరిస్థితి నియంత్రణకు అందకుండా పోయే ప్రమాదం కనిపిస్తోంది. చరిత్ర చెబుతున్న స్పష్టమైన సత్యం ఏమిటంటే యుద్ధం ప్రారంభించడం సులభం, కానీ దాన్ని ఆపడం అత్యంత క్లిష్టం. ఒకసారి ఆయుధాలు మోగితే, దాని ప్రభావం సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుంది. యుద్ధం మొదలైన క్షణంలోనే మొదటి బలులు అమాయక పౌరులే. ఇళ్లు కూలిపోతాయి, కుటుంబాలు చెదిరిపోతాయి, పిల్లల భవిష్యత్తు చీకటిలో మగ్గుతుంది. శరణార్థుల ప్రవాహం పెరుగుతుంది. ఆహారం, నీరు, ఔషధాల కొరత తీవ్రమవుతుంది. మానవత్వం అనే విలువే పరీక్షకు గురవుతుంది. శక్తి ప్రదర్శన పేరుతో జరిగే ఈ ఘర్షణలు చివరికి మానవ సమాజానికే శాపంగా మారుతాయి. ఇది కేవలం ఒక ప్రాంతానికే పరిమితమయ్యే సంక్షోభం కాదు; ప్రపంచ స్థిరత్వానికే సవాల్. ఆర్థిక రంగంపై యుద్ధ ప్రభావం మరింత ప్రమాదకరం. చమురు ధరలు పెరుగుతాయి, సరఫరా వ్యవస్థలు దెబ్బతింటాయి, ద్రవ్యోల్బణం అదుపు తప్పుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. పెట్టుబడులు తగ్గిపోతాయి, ఉపాధి అవకాశాలు క్షీణిస్తాయి. ఒక దేశం మధ్య జరిగే ఘర్షణ ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తుంది. దీని మూల్యం చివరికి సామాన్య ప్రజలే చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రపంచ నాయకులు అప్రమత్తంగా ఆలోచించాలి. ఆయుధ పోటీలు, అణు హెచ్చరికలు, కఠిన ప్రకటనలు సమస్యలకు పరిష్కారం కావు. రాజనీతిక చర్చలు, పరస్పర గౌరవం, సహనం ఇవే శాశ్వత శాంతికి మార్గం. యుద్ధం ద్వారా గెలిచిన విజయాలు తాత్కాలికం మాత్రమే; కానీ శాంతి ద్వారా సాధించిన ఒప్పందాలు తరతరాలకు నిలుస్తాయి. ప్రపంచం మళ్లీ విధ్వంసపు అంచున నిలవకూడదంటే ఇప్పుడే సంభాషణకు, సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. యుద్ధం ఎవరికీ మేలు చేయదు శాంతి మార్గమే సమస్త మానవాళికి నిజమైన రక్షణ.

# వైఎస్ జగన్‌ను ఆహ్వానించిన భట్టి విక్రమార్క





-సూర్య విక్రమాదిత్య వివాహానికి ఆహ్వానం
-మర్యాదపూర్వకంగా అందజేసిన పత్రిక
-నూతన దంపతులకు ఆశీర్వాదం కోరిన భట్టి

అమరావతి,మార్చి3 (మన ప్రజా ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిను భట్టి విక్రమార్క మల్లూ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. కుటుంబ వేడుకకు రాజకీయ నాయకులు హాజరై ఆశీర్వదించాలని భట్టి విక్రమార్క కోరినట్లు సమాచారం. వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరవనున్నట్లు తెలిసింది. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రాజకీయ విభేదాలకు అతీతంగా వ్యక్తిగత సందర్భాల్లో పరస్పర గౌరవం కొనసాగుతుందని ఈ సమావేశం ద్వారా వెల్లడైంది.

# మానవవన్యప్రాణి సంఘర్షణ నివారణకు 'హనుమాన్' ప్రాజెక్ట్ ప్రారంభం

- 100 ప్రత్యేక తక్షణ ప్రతిస్పందన వాహనాల ఆవిష్కరణ
- అటవీ సరిహద్దు గ్రామాల రక్షణకు చర్యలు
- వైద్య సహాయం, పరిహార వ్యవస్థలతో సమగ్ర ప్రణాళిక





మంగళగిరి, మార్చి 3 (మన ప్రజాప్రతినిధి): మనుషులు వన్యప్రాణుల మధ్య పెరుగుతున్న సంఘ ర్షణలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఉప ముఖ్యమంత్రి, అటవీ మరియు పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీస్ ఆరవ బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా పూర్తిస్థాయి సాంకేతిక సదుపాయాలతో కూడిన 100 ప్రత్యేక తక్షణ ప్రతిస్పందన మరియు రక్షణ వాహనాలను ఆవిష్కరించారు. వీటిలో 93 తక్షణ ప్రతిస్పందన వాహ నాలు కాగా, 7 వాహనాలు వన్యప్రాణుల వైద్య సహాయం కోసం అంబులెన్స్‌లుగా వినియోగిం చబడనున్నాయి. విశాఖ పట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, బైర్లుటిల్లో నాలుగు వన్యప్రాణి రక్షణ మరియు చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదనంగా 19 తక్షణ ప్రతిస్పందన బృందాలు సిద్ధంగా ఉంచారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వసుధైక కుటుంబం అనే భావనను విశ్వసించే దేశంగా మనం సమస్త జీవకోటిని కాపాడాల్సిన బాధ్యత కలిగివున్నామని అన్నారు. హనుమాన్ ప్రాజెక్ట్ మానవవన్యప్రాణి సంఘర్షణను తగ్గించేందుకు శాస్త్రీయ, సాంకేతిక విధానాలతో రూపొందించబడిందని తెలిపారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజల ప్రాణాలు, పంటలు, పశుసంపద రక్షణతోపాటు వన్యప్రాణుల సంరక్షణ కూడా ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వాహనంలో అటవీ రేంజ్ అధికారి, జంతు వైద్య సిబ్బంది, గిరిజన సహాయకులు, పారా వెటరినరీ సిబ్బంది ఉండేలా వ్యవస్థ ఏర్పాటు చేశారు. గ్రామ స్థాయిలో 'వజ్ర' బృందాలను తయారు చేసి వారికి ప్రత్యేక రక్షణ కిట్లు అందిస్తున్నారు. సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు తక్షణ చర్యలు, ఉపశమన చర్యలు, పరిహార చెల్లింపులు సమన్వయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ కూడా పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రి కుంభాభిషేకానికి.. ముఖ్యమంత్రికి ఆహ్వానం


- 6 నుంచి 8 వరకు మహోత్సవాలు
- ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేత
- స్వామివారి చిత్రపటం, ప్రసాదం సమర్పణ



విజయవాడ, మార్చి 3 (మన ప్రజా ప్రతినిధి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేక మహోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్ కలిసి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. దేవస్థానం తరఫున స్వామివారి చిత్రపటాన్ని సమర్పించి, ప్రసాదాన్ని అందించారు. మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కుంభాభిషేక మహోత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తుల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి ఆశీర్వచనం అందించారు. మహోత్సవాలు విజయవంతంగా సాగాలని, రాష్ట్ర ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు

# వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం హరీశ్ రావు ప్రశంసలు

-బీఎల్ఆర్ దాతృత్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ
-122 మంది వైద్య విద్యార్థులకు లబ్ధి
-ప్రజా ఆరోగ్య రంగ భవిష్యత్తుపై దృష్టి





హైదరాబాద్, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేపట్టిన దాతృత్వ కార్యక్రమాన్ని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రశంసించారు. బీఎల్ఆర్ దాతృత్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనే 122 మంది వైద్య విద్యార్థులు ఈ సహాయాన్ని పొందినట్లు పేర్కొన్నారు. వైద్యులుగా ఎదగాలనే ఆశయంతో చదువుతున్న ప్రతిభావంతులైన యువతకు చేయూతనివ్వడం దాతృత్వం మాత్రమే కాకుండా ప్రజా ఆరోగ్య వ్యవస్థ భవిష్యత్తుపై పెట్టుబడిగా భావించాలని హరీశ్ రావు అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువులు ఆగిపోకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందని పేర్కొన్నారు. అర్హులైన, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో సమాన అవకాశాలు కల్పించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. విద్య, ఆరోగ్య రంగాల్లో పెట్టుబడులు పెడితేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణలో ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల స్థాపనతో "తెల్ల కోటు విప్లవం" చోటుచేసుకుందని హరీశ్ రావు గుర్తుచేశారు. వైద్య విద్య

# నేపాల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు మూసివేత

**-డెబ్బై రెండు గంటల పాటు కట్టుదిట్టమైన భద్రత**
**-రెండువందల డెబ్బై ఐదు స్థానాలకు కీలక పోరు**
**-విదేశీ వాహనాలపై నిషేధం, సంయుక్త గస్తీ**



న్యూఢిల్లీ, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): నేపాల్‌లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా భద్రతా చర్యలను కఠినతరం చేస్తూ భారత్‌నేపాల్ సరిహద్దును డెబ్బై రెండు గంటల పాటు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఈ ఆంక్షలు అమల్లోకి వచ్చాయని, గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగుతాయని అక్కడి అధికారులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ శక్తులు దేశంలోకి ప్రవేశించకుండా నిరోధించడమే ఈ నిర్ణయానికి కారణమని పేర్కొన్నారు. భారత్ లేదా నేపాల్‌లో ఎన్నికలు జరిగినప్పుడు సరిహద్దు పాయింట్లను తాత్కాలికంగా మూసివేయడం ఇరు



దేశాల మధ్య అనుసరించే సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈసారి సమగ్ర భద్రతా ప్రణాళికలో భాగంగా సరిహద్దును మూసివేయాలని నిర్ణయించినట్టు నేపాల్ సాయుధ పోలీసు దళం అధికార ప్రతినిధి డీఐజీ విష్ణు ప్రసాద్ భట్ట తెలిపారు. అయితే నిత్యావసర సరుకుల రవాణా, సరిహద్దు ప్రాంతాల్లో చిక్కుకున్న విదేశీయులకు మాత్రం మినహాయింపులు ఉంటాయని స్పష్టం చేశారు. నేపాల్ పార్లమెంటులోని మొత్తం రెండువందల డెబ్బై ఐదు స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కూలిపోవడంతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. యువత ఆధ్వర్యంలో సాగిన ఉద్యమ ప్రభావంతో ప్రభుత్వం పడిపోవడంతో, ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో తాత్కాలిక ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది.ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో విదేశీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాల రాకపోకలపై కూడా నిషేధం విధించారు. అనుమానిత వ్యక్తులు, గ్రూపులు దేశంలోకి చొరబడకుండా భారత సశస్త్ర సీమా బల్‌తో కలిసి సంయుక్త గస్తీ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. గత ఆందోళనల సమయంలో లూటీకి గురైన ఆయుధాలు ఇంకా పూర్తిగా లభ్యం కాకపోవడంతో భద్రతా దళాలు మరింత అప్రమత్తంగా ఉన్నాయని వెల్లడించారు.

# స్వదేశానికి 149 మంది భారతీయులు

**-మధ్యప్రాచ్య ఉద్రిక్తతల మధ్య 149 మంది భారతీయుల రక్షణ**
**-ప్రత్యేక చర్యలో తొలి విమానం ఢిల్లీ చేరిక**
**-సిబ్బందితో కలిపి మరో ప్రత్యేక రాక**
**-భద్రతే ప్రథమ కర్తవ్యం అంటున్న సంస్థ**



న్యూఢిల్లీ, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దుబాయ్‌లో చిక్కుకుపోయిన 149 మంది భారతీయులను ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చింది. ప్రత్యేక చర్యలో భాగంగా నడిపిన విమానం మంగళవారం ఉదయం 10 గంటల 58 నిమిషాలకు ఢిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా దిగినట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆ విమానంలో మొత్తం 149 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చిన తొలి భారతీయ విమానం ఇదే కావడం గమనార్హం. దుబాయ్‌లో చిక్కుకున్న వారిని స్వాగతిస్తున్నామని సంస్థ పేర్కొంది. ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఢిల్లీ విమానాశ్రయంలో భావోద్వేగంతో స్వాగతం పలికిన దృశ్యాలు కనిపించాయి.ఇదే ప్రత్యేక చర్యలో భాగంగా అంతకుముందు మరో విమానం కూడా ఢిల్లీకి చేరుకుంది. ఆ విమానంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 143 మంది పైలట్లు, సిబ్బందిని సురక్షితంగా తరలించారు. వారంతా సురక్షితంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు, సంస్థ యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఈ ప్రత్యేక విమానాలను నడిపేందుకు తమ నిర్వహణ నియంత్రణ కేంద్రం, ఇతర సహాయక బృందాలు రాత్రింబవళ్లు పనిచేశాయని సంస్థ వెల్లడించింది. అసాధారణ పరిస్థితుల్లోనూ తరలింపు ప్రక్రియను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగించినట్లు తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసింది. అవసరమైన అనుమతులు లభించిన వెంటనే మరిన్ని విమానాలను నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంస్థ వెల్లడించింది.

# నార్సింగిలో మూసీ ఆక్రమణపై తెలంగాణ జాగృతి ఆందోళన

**-భారీ రియల్ ఎస్టేట్ వెంచర్‌పై చర్యలు కోరుతూ నిరసన**
**-గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో ఇళ్ల తొలగింపులపై విమర్శలు**
**-అక్రమ నిర్మాణాలు ఎందుకు కనిపించవని ప్రశ్న**



హైదరాబాద్, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న భారీ రియల్ ఎస్టేట్ వెంచర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థానికులతో కలిసి ఆందోళన చేపట్టారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని నినాదాలు చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో ప్రజల నివాసాలను తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేదల ఇళ్లను కూల్చే చర్యలు చేపడుతున్న అధికార యంత్రాంగానికి ఈ భారీ అక్రమ వెంచర్ కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఒకవైపు పేదలపై కఠిన చర్యలు తీసుకుంటూ, మరోవైపు పెద్ద ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం చూపడం ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు కూడా ఆందోళనలో పాల్గొని మూసీ నది పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నదీ ప్రవాహాన్ని అడ్డుకునే నిర్మాణాలు భవిష్యత్తులో వరద ముప్పుకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి నాయకులు కోరారు. ప్రజల ఆస్తులు, జీవనోపాధి కాపాడటంతోపాటు నదుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని తెలిపారు.

# ప్రమాదాల తగ్గింపే ప్రధాన లక్ష్యం

**-రహదారి భద్రత ప్రచారాలు**
**-ప్రతి ప్రాణం అమూల్యం**
**-నియమాల అమలులో కఠినత్వం**
**-అవగాహనలో సానుకూలత**
**-సురక్షిత ప్రయాణానికి సమాజ భాగస్వామ్యం**



మార్చి 3 (మనప్రజాప్రతినిధి): రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక రహదారి భద్రతా ప్రచారాలను ముమ్మరం చేశారు. రోజురోజుకీ పెరుగుతున్న వాహనాల సంఖ్య, వేగవంతమైన జీవనశైలి కారణంగా రహదారులపై ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై కఠిన తనిఖీలతో పాటు ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నారు. ర్యాలీలు, అవగాహన శిబిరాలు, ట్రాఫిక్ సంకేతాల వద్ద ప్రత్యేక ప్రచారాలు నిర్వహిస్తూ వాహనదారులకు భద్రతా సూచనలు అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేలాది మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండగా, లక్షలాది మంది గాయాలపాలవుతున్నారు. వేగం మితిమీరడం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం, ట్రాఫిక్ సంకేతాలను లెక్కచేయకపోవడం వంటి కారణాలు ప్రధానంగా గుర్తించబడ్డాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ విభాగం కఠిన తనిఖీలు నిర్వహిస్తూ ఉల్లంఘనలకు జరిమానాలు విధిస్తోంది. అదే సమయంలో శిక్షలతో మాత్రమే సమస్య పరిష్కారం కాదని గుర్తించి, ప్రజల్లో బాధ్యతాయుత దృక్పథం పెంపొందించేందుకు విద్యా కార్యక్రమాలు కూడా చేపడుతోంది. హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహనదారులకు ప్రాణరక్షక కవచంగా నిలుస్తుంది. ప్రమాద సమయంలో తలకు తగిలే దెబ్బ తీవ్రతను గణనీయంగా తగ్గించే సామర్థ్యం హెల్మెట్‌కు ఉంది. అలాగే సీట్ బెల్ట్ వినియోగం నాలుగు చక్రాల వాహనదారులను ప్రమాద సమయంలో ముందుకు విసిరివేయకుండా కాపాడుతుంది. చిన్న జాగ్రత్తలే ప్రాణాలను కాపాడగలవన్న సందేశాన్ని అధికారులు స్పష్టంగా తెలియజేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, నివాస కాలనీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతలో భద్రతా చైతన్యాన్ని పెంచుతున్నారు.రహదారి భద్రత అనేది కేవలం చట్ట అమలు సంస్థల బాధ్యత కాదు; ప్రతి పౌరుడి బాధ్యత. ట్రాఫిక్ నియమాలను పాటించడం, ఇతర వాహనదారులను గౌరవించడం, పాదచారుల భద్రతను కాపాడడం వంటి చర్యలు సమాజానికి రక్షణ కవచంగా నిలుస్తాయి. కుటుంబ సభ్యులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలంటే ప్రతి ప్రయాణం ముందు జాగ్రత్త అవసరం. అప్రమత్తత, క్రమశిక్షణ, బాధ్యత అనే విలువలను ఆచరిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చు. ప్రతి ప్రాణం అమూల్యమనే భావనతో రహదారిపై అడుగులు వేస్తేనే సురక్షిత సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.ప్రతి సంవత్సరం దేశంలో వేలాది మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వేగం మితిమీరడం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రాఫిక్ సంకేతాలను పట్టించుకోకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ విభాగం కఠిన తనిఖీలు నిర్వహిస్తూ నియమావళి ఉల్లంఘనలకు జరిమానాలు విధిస్తోంది. అదే సమయంలో శిక్షలతో పాటు చైతన్య కార్యక్రమాలు కూడా చేపట్టి ప్రజల్లో బాధ్యతాయుత భావన పెంపొందించేందుకు కృషి చేస్తోంది. హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి రక్షణ పరికరాలు చిన్న చర్యలా కనిపించినా, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడగల కీలక సాధనాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ కట్టుకోవడం ద్వారా తీవ్రమైన గాయాల నుంచి తప్పించుకోవచ్చు. ఈ విషయాలపై విద్యాసంస్థలు, కార్యాలయాలు, కాలనీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రహదారి భద్రత కేవలం ట్రాఫిక్ పోలీసుల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి బాధ్యత. నియమాలను పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలం. అప్రమత్తత, క్రమశిక్షణ, బాధ్యత అనే మూడు సూత్రాలను పాటిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. రహదారిపై ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తేనే సురక్షిత సమాజం సాధ్యమవుతుంది.

# రంజాన్ వేడుకల్లో దొమ్మాట గ్రామం మెరిసింది



(మనప్రజాప్రతినిధి//మార్చి 03):దౌల్తాబాద్ మండలం లోని దొమ్మాట గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గురువుగారి ప్రవీణ్, బి.మరి స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రంజాన్ పవిత్ర పండగ సందర్భంగా గ్రామంలోని ముస్లిం కుటుంబాలకు ప్రేమ, సౌభ్రాతృత్వం మరియు ఐక్యతకు ప్రతీకగా ఈ విందు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపవాస దీక్షలు ముగించుకున్న ముస్లిం సోదరులకు రుచికరమైన వంటకాలతో విందు వడ్డించారు. ఈ సందర్భంగా గురువుగారి ప్రవీణ్ మాట్లాడుతూ, రంజాన్ పండగ సమాజంలో సోదరభావాన్ని పెంపొందించే పర్వదినమని అన్నారు. బిమరి స్వామి మాట్లాడుతూ, అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసిమెలిసి జీవించడం గ్రామ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది


# మినాబ్‌లో విషాదం 165 బాలికల సమాధులు ఒకేచోట

**-వైమానిక దాడుల్లో పాఠశాల పై ప్రభావం**
**-180 మృతుల్లో 165 మంది బాలికలు**
**-సామూహిక అంత్యక్రియల పై అంతర్జాతీయ ఆందోళన**



టెహ్రాన్, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): అమెరికాఇజ్రాయెల్ వైమానిక దాడుల నేపథ్యంలో ఇరాన్‌లోని మినాబ్ ప్రాంతంలో చోటుచేసుకున్న విషాద ఘటన ప్రపంచాన్ని కలచివేసింది. అక్కడి ఓ పాఠశాలపై దాడి జరగడంతో మొత్తం 180 మంది మృతిచెందినట్లు సమాచారం. ఇందులో 165 మంది బాలికలే ఉన్నట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు. మృతులందరినీ ఒకేచోట సమాధి చేసినట్లు సమాచారం. ఇందుకోసం పెద్ద సంఖ్యలో గోతులు తవ్విన దృశ్యాలను ఇరాన్ మంత్రి అబ్బాస్ విడుదల చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా ఆవేదన కలిగించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ప్రతిస్పందనలు రేకెత్తిస్తోంది. పిల్లలపై జరిగిన ఈ దాడిని ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. నిరపరాధుల ప్రాణనష్టంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. సంఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.మినాబ్ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. శాంతి చర్చలే సమస్యకు పరిష్కారమని, నిరపరాధుల ప్రాణాలను కాపాడేందుకు అంతర్జాతీయ సమాజం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# పి ఆర్ టి యు ఆధ్వర్యంలో కౌన్సిలర్ అప్పిరెడ్డి కి సన్మానం



నేరేడుచర్ల(మనప్రజాప్రతినిధి):పి ఆర్ టి యు నేరేడుచర్ల మండల శాఖ ఆధ్వర్యంలో కౌన్సిలర్ గా ఎన్నికైన దొండపాటి అప్పిరెడ్డికి సన్మాన కార్యక్రమం నేరేడుచర్ల పి ఆర్ టి యు మండల శాఖ అధ్యక్షుడు ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నేరేడుచర్ల మున్సిపాలిటీకి మూడో వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన దొండపాటి అప్పిరెడ్డి దంపతులకు ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర ఆడిట్ కమిటీ వైస్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి అధ్యక్షుడు ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఉపాధ్యాయ వృత్తికి రిజైన్ చేసి రాజకీయంలో ప్రవేశించి నేడు కౌన్సిలర్ గా ఎన్నికైనందుకు మండల శాఖ నుండి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు దొండపాటి అప్పి రెడ్డి పి ఆర్ టి సంఘానికి ఎల్లప్పుడూ తన సహకారాన్ని అందిస్తున్నందుకు మండల శాఖ నుండి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బట్టు మధు జిల్లా గౌరవ అధ్యక్షుడు కొనతం వెంకట్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు రమావత్ దీప్లా నాయక్ మండల ప్రధాన కార్యదర్శి మాతంగి సైదులు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చందమల్ల వెంకన్న జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సత్యనారాయణ కే ప్రసాద్ జిల్లా కార్యదర్శి పి శ్రీధర్ మండల అసోసియేట్ అధ్యక్షులు ఎం వెంకట్ రెడ్డి మండల కార్యదర్శి డి నాగయ్య మండల మహిళా ఉపాధ్యక్షురాలు బి విజయ మండల మహిళా కార్యదర్శి ఎన్ నాగవాణి మండల సీనియర్ నాయకులు పి రవి ఆర్ గోపా నాయక్ రిటైర్డ్ టీచర్ గుండ్రెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు

# తీరప్రాంత అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు...



పోలాకి మార్చి3 (మనప్రజాప్రతినిధి తెలుగుదినపత్రిక):నరసన్నపేట నియోజకవర్గంలో తీరప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నింపే దిశగా కీలక ముందడుగు పడిందని,గౌరవ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రతిపాదన మేరకు కూల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కార్యక్రమం కింద తీరప్రాంతాల్లో ఎలక్ట్రికల్ దీపాల ఏర్పాటు చేపట్టనున్నట్లు పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఓ ప్రకటనలో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలు సాయంత్రం తర్వాత చీకటిలో మగ్గిపోతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్యులు ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు సరైన వెలుతురు అవసరమని, మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రత దృష్ట్యా వీధి దీపాలు అత్యంత అవసరమని అన్నారు.ఈ ప్రతిపాదనకు సంబంధించి అవసరమైన పరిపాలనా ప్రక్రియలు పూర్తి చేసి శాంక్షన్ సాధించడంలో కేంద్ర మంత్రి కీలక పాత్ర పోషించారని తెలిపారు. తీరప్రాంత అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్న కేంద్ర మంత్రివర్యులకు తీరప్రాంత ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వెల్లడించారు.సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు కానున్న విద్యుత్ దీపాల ద్వారా రాత్రివేళల్లో ప్రమాదాలు తగ్గడమే కాకుండా సామాజిక భద్రత మెరుగుపడుతుందని, తీరప్రాంతాల్లో అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చి నరసన్నపేట నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# విద్యా కమిషన్ నివేదిక తప్పుల తడక




-సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు ధ్వజం

పాలక వీడు (మనప్రజాప్రతినిధి దినపత్రిక ):ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన విద్యా కమిషన్ నివేదిక తప్పుల తడక గా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనంజయ నాయుడు ధ్వజమెత్తారు మంగళవారం నాడు ఆయన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలో మండల సిపిఐ కార్యదర్శి ముళ్ళ జానయ్య ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ జిల్లా కమిటీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ..... బడుగు బలహీన వర్గాల పిల్లలను విద్యకు దూరం చేయటంలో భాగంగానే ఇలాంటి సిఫారసులు చేసిందని కార్పొరేట్ కళాశాలకు కొమ్ము కాసే ప్రయత్నంలో భాగంగా విద్యా కమిషన్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి ఇంటర్లో విద్యార్థి సాధించిన మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కల్పించాలని కోరిందని అలాగే ఫీజు రియంబర్స్మెంట్ రద్దు చేయాలని సూచించడం కూడా సరైనది కాదని ఈ పథకం ఉండడం వల్లనే గ్రామీణ మండల నియోజక˘వర్గస్థాయిలో నివాసం ఉంటున్న విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించగలుగుతున్నారని మరియు ఉపాధ్యా యులకు చెల్లిస్తున్న జీతాలు చాలా అధికంగా ఉన్నాయని కొత్తగా చేపట్టే నియామకాలు ఎంపిక అయ్యే వారిని తక్కువ జీతంతో కాంట్రాక్టు పద్ధతిన నియమించాలన్న సిఫార్సులను అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి,ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించాలని ఆయన కోరారు ప్రీ- ప్రైమరీ విద్యను పాఠశాలలకు తరలిస్తే రాష్ట్రాల్లోని 35 వేల అంగన్వాడి కేంద్రాల పరిస్థితి ఏమిటని వాటిని మూసివేస్తారా అని ఇది కేవలం ప్రభుత్వ ఖర్చు తగ్గించేందుకు చేస్తున్న కుట్ర అని దీనివల్ల అంగన్వాడి వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందని విద్యావేత్త అయిన ఆకునూరి మురళి ఇలాంటి సిఫార్సులు చేయడం వెనక ఎవరున్నారు అని ఆయన ప్రశ్నించారు ప్రభుత్వం ఈ నివేదికను పెండింగ్ లో ఉంచాలని అన్ని విద్యార్థి ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు మరియు అన్నియూనియన్లతో సంప్రదింపులు జరిపి వారి సూచనల మేరకు నివేదికను రూపొందించాలని ఆయన కోరారు

# హోలీ సంబరాల్లో పాల్గొన్న చిన్నార్లు



మన ప్రజా ప్రతినిధి తేదీ03/3/2026 మంగళవారం: తిరుమలగిరి మండల కేంద్రంలోని తాటిపాముల గ్రామ సర్పంచ్ బోయపల్లి కిషన్ గారు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా తీరొక్క కలర్లతో హోలీ సంబరాల్లోచిన్నారులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో బేతు అభిలాష్ సన్నీ చింటూ తదితరులు పాల్గొన్నారు

# మనోభావాలు దెబ్బతీసేలాఉన్నది



మనప్రజాప్రతినిధి//చేగుంట:మనోభావాలు దెబ్బతీయడం సరికాదుపులిమామిడి గ్రామంలో తలమడ్ల నర్సింలు మాట్లాడుతూ... తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసేలాఉన్నదని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తలమడ్ల నర్సింలు అన్నారు.బడుగు బలహీన వర్గాలు చదివే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే ఈ కమిషన్ నివే దిక సరికాదన్నారు. వెంటనే విద్యారంగ నిపుణులతో చర్చించి సూచనలు, సలహాలు తీసుకొని కమిషన్ నివే దికలో మార్పులు చేసి ముందుకు సాగాలని కోరారు

# నార్సింగిలో కల్వకుంట్ల కవిత అరెస్టు

**-అక్రమ వెంచర్లపై ఆందోళన**
**-పోలీసులతో వాగ్వాదం, తోపులాట**
**-కార్యకర్తల నినాదాలు**

హైదరాబాద్, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని హైడ్రాను నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు ఆందోళన విరమించబోమని కవిత హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి



తీసుకున్నారు. కవితను పోలీసు వాహనాల్లో ఎక్కించే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు న్యాయం కావాలని నినాదాలు చేస్తూ అక్రమ వెంచర్లను కూల్చాలని డిమాండ్ చేశారు. హైడ్రా అధికారులు రంగనాథ్ వెంటనే అక్కడికి రావాలని కోరారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయం అయినట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు

# వాణినికేతన్ హైస్కూల్ లో హోలీ సంబరాలు




మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 03 మార్చ్ :ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్లో ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో మంగళవారం ఒకరికొకరు రంగులు పులుముకుని అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హోలీ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే వారి జీవితాలు సప్తవర్ణ శోభితాలు అవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, తిరుపతి, రమేష్, రాజు, సుమంగళి, శోభ, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, స్వాతి, రేణుక, జలజ, శాంత, పద్మ, రేణుక, సునీత, షమీమా లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

# కేరింతల కేళి మండలం లో హోలీ సందడి




మనప్రజాప్రతినిధి//చేగుంట మార్చ్ 03:చేగుంట మండలం లో ఉన్న అన్ని గ్రామాలలో,పట్టణంలో హోలీ పండుగ పర్వదినం సందడి వాతావరణంలో జరిగింది. గ్రామాలలో ముఖ్యంగా చిన్నారులు ఉదయం నుండి రంగు ,రంగుల,కలర్లు చల్లుకుంటూ కేరింతలు,కొడుతూ హోలీ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చేగుంట పట్టణ కేంద్రం లో,కాలనీలు, వీధుల్లో ఉదయం నుంచే పిల్లల, పెద్దలు అల్లరి సందడి కనిపించింది. ఒకరిపై ఒకరు రంగులు పోసుకుంటూ, నీటి తుపాకులతో ఆడిపాడుతూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో, సురక్షితంగా వేడుకలు నిర్వహించారు. మండలం లో ఎటువంటి అపశృతి లేకుండా హోలీ పండుగను చిన్నారులు సంతోషంగా జరుపుకున్నారు

# మున్సిపల్ వైస్ చైర్పర్సన్ రేణుక చిరు ఆధ్వర్యంలో... కౌన్సిలర్ జన్మదిన వేడుకలు



సదాశివపేట మార్చి 3 (మన ప్రజా ప్రతినిధి):బుధ వారం రోజు 18వ వార్డు కౌన్సిలర్ నికిత బిట్ల ప్రేమ్ కుమార్ జన్మదిన వేడుకలను మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువా వేసి పూలమాలతో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్పర్సన్ రేణుక చిరు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలనిఆ భగవంతుని మనసారా ప్రార్థిస్తున్నానని తెలిపారు. కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ కౌన్సిలర్లు సజ్జి, నర్సింలు, మిలిగిరిపేట సర్పంచ్ షాబుద్దీన్, కలీమ్ ఖురేషి, విష్ణువర్ధన్ రెడ్డి, వసీం భాయ్, కోడూరు శరత్ చంద్ర, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు గౌడ్, ఈశ్వర్ మార్కండేయ మందిర చైర్మన్ వెంకన్న బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాజేద్, విజయ్, నరసింహ యాదవ్, సిద్ధూ, మోయిజ్, శ్రీను, దిలీప్, జీవన్, వరుణ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# హోలీ పండుగ శుభాకాంక్షలు



మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా : రామయంపేట్ మండలం గ్రామం ఝాన్సీ లింగాపూర్ ఫిబ్రవరి తేదీ:-3/3/26 తెలిపారు సుఖనం తోషాలు ఆనందాన్ని నింపాలని ఐక్యతను పెంపొందించాలని ఆకర్షించారు హోలీ పండుగ మండల గ్రామ సర్పంచులకు హోలీ పండుగను ఆనందంగా సురక్షితంగా జరుపుకోవాలని ప్రజలకు సురక్షితంగా జరుపుకోవాలని సహజ సిద్ధమైన రంగులతో సాంప్రదాయ పద్ధతులతో రంగుల పండుగలను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు

# గూడ్స్ రైలు నుంచి గ్యాస్ లీక్

తృటిలో తప్పిన పెద్దప్రమాదం జలుమూరు (తిలారు) : మార్చి 3 శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం తిలారు రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి పలాస వెళ్తున్న గ్యాస్ ట్యాంకర్ల గూడ్స్ తిలారు స్టేషన్ సమీపానికి వచ్చేసరికి రైలు నుంచి ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయింది. దీంతో గమనించిన రైల్వే సిబ్బంది, అధికారులు అప్రమత్తం అయ్యారు. వెంటనే తిలారు రైల్వేస్టేషన్లో రైలు నిలుపుదల చేసి గూడ్స్ బోగీలను వేరు చేసి మరమ్మతులు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని అప్రమత్తమయ్యారు. కొంత సమయానికి ప్రస్తుత పరిస్థితి అదుపులో ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. గ్యాస్ ట్యాంకర్ నుంచి గ్యాస్ లీక్ అయిన సమాచారం పరిసర ప్రాంతాల్లో దావానంలా ప్రాకడంతో ఈ పరిధిలో ప్రజలంతా ఆందోళనకు గురై ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బిక్కుబిక్కు అంటూ కాలం గడిపారు. కొంత సమయానికి అధికారులు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని, మరమ్మతులు చేపట్టడం జరిగిందనీ చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం మీద పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. గ్యాస్ ట్యాంకర్లను కోటబొమ్మాళి స్టేషన్ కు తరలించి రైల్వే ఉన్నతాధికారుల అనుమతి వచ్చేక గమ్యస్థానానికి చేర్చడం జరుగుతుందని సంబంధిత అధికారులు వెల్లడించారు.



# కొత్త పింఛన్ల హామీ గాలికేనా..?

- కొత్త పింఛన్ల కోసం అర్హుల ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు..?
- కనీసం వెబ్సైట్ కూడా ఓపెన్ చేయని ప్రభుత్వం.
-సచివాలయాలకు తిరుగుతున్నదరఖాస్తుదారులు...
-అర్హులకు కొత్త పింఛన్ల ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించింది.



(మనప్రజాప్రతినిధి తెలుగుదినపత్రిక):బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సరుబుజ్జిలి వైఎస్సార్ సీపీ పార్టీ మండలం అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇంకా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గతేడాది అక్టోబర్ 1వ తేదీనుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు. కనీసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్సైట్ కూడా తెరవలేదు. దీంతో మండలాల్లో అర్హులైన లబ్ధిదారులు మండిపడుతున్నారు. అర్హుల ఆవేదనఅర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమిప్రభుత్వం పింఛన్ మంజూరుపై ఎలాంటి నిర్ణయంతీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.గ్రామ సచివాలయముదరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకురోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళు న్నారు.ప్రభుత్వం వెబ్సైట్ తెరవకపోవడంతో నిరాశతోవెనుది రుగుతున్నారు. ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వంలో పక్కాగా..గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పక్కాగా పింఛన్లు అందించేవారు. రాజకీయ పార్టీలతో సంబంధంలేకుండా వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి, సచివాలయాల్లో ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియనిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితిలేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వెబ్సైట్ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.పింఛన్ల హామీ గాలికేనా..?కూటమి ప్రభుత్వం విఫలంఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లోప్రభుత్వంపూర్తిగా విఫలమైంది.ప్రభుత్వం ఏర్పడి 20 నెలలైనా హామీలను నెరవేర్చలేదు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటివరకు వెబ్సైట్ ఓపెన్ అవ్వలేదు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అర్హతఉంటే చాలు వలంటీర్లే ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తు చేయించేవారు. ఇప్పుడు కనీసం వెబ్సైట్ ఓపెన్ చేయటం లేదు. కొత్త పింఛన్ల దరఖాస్తుకోసం ప్రభుత్వం నుంచివెబ్సైట్ ఓపెన్ కాలేదు.ఇప్పటికే సచివాల యాలకు దరఖాస్తులు వస్తున్నాయి. మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని కూటమినాయకులు హామీ ఇచ్చారు. కానీ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లోనూ దీనికోసం నిధులు కేటాయించలేదు. దీంతో హామీ గాలికి వదిలేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు

# వెలుగుమట్ల బాధితులకు అండగా బీఆర్ఎస్

-గూడు కోల్పోయిన భూదాన్ నిరుపేదలకు సహాయం
-న్యాయపోరాటానికి మద్దతు
-పువ్వాడ ఫౌండేషన్ ద్వారా భోజన వసతి



ఖమ్మం, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో గూడు కోల్పోయిన భూదాన్ నిరుపేదలకు భారత రాష్ట్ర సమితి అండగా నిలిచింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు జిల్లా నాయకత్వం బాధితులకు న్యాయపోరాటంలో సహకారం అందిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ, గూడు చెరిగిన కుటుంబాలకు తక్షణ సహాయంగా ఆహారం, తాగునీటి వసతులు కల్పిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ అండ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలోని పువ్వాడ ఫౌండేషన్ ద్వారా బాధితులకు భోజనం, నీళు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో సహాయం అందించడంపై బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.గూడు కోల్పోయిన పేదల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి న్యాయం జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.



# ప్రజాభవన్‌లో లక్ష్మీ మంచుతో సీతక్క భేటీ

-మార్చి 27 కార్యక్రమానికి ఆహ్వానం
-ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ విద్యా మద్దతు
-ట్రస్ట్ సేవలను అభినందించిన మంత్రి



హైదరాబాద్, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): మంత్రి దనసరి సీతక్క ప్రజాభవన్‌లో నటి, 'టీచ్ ఫర్ చేంజ్' ట్రస్ట్ స్థాపకురాలు లక్ష్మీ మంచును కలిశారు. మార్చి 27న నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరుకావాలని లక్ష్మీ మంచు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తమ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తున్న డిజిటల్ విద్యా మద్దతు, ఇతర సేవా కార్యక్రమాల గురించి వివరించారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడం లక్ష్యంగా చేపడుతున్న చర్యలను మంత్రి సమక్షంలో వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఇటువంటి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమని సీతక్క అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు డిజిటల్ సదుపాయాలు కల్పించడం ప్రశంసనీయమని అన్నారు.సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. విద్యా రంగంలో ప్రజా భాగస్వామ్యంతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

# పోతిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన నర్మదకు నంది అవార్డు

-కష్టపడి పని చేస్తేనే ఏదైనా గుర్తింపు......
-కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమే
-నంది అవార్డు గ్రహీత కత్తుల నర్మద....






మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజక వర్గం:జనగామ నియోజకవర్గం,చేర్యాల మండలం,పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కత్తుల నర్మదకు హైదరాబాద్,బిర్లా మందిర్ లోని భాస్కరాచార్య ఆడిటోరియంలో సోమవారం రోజున మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా ఉగాది పురస్కారాల్లో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన సినీ యాక్టర్,మాజీ మంత్రి, బాబు మోహన్ చేతుల మీదుగా బెస్ట్ ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్ గా నంది అవార్డు అందుకున్నారు.ఈ అవార్డు ఆమెకు బ్యూటిషన్ రంగంలో సేవలకు గాను బెస్ట్ ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్ గా అవార్డు వచ్చింది.ఈ సందర్భంగా కత్తుల నర్మద మాట్లాడుతూ....ఏ రంగంలో అయినా పట్టుదలతో, సమయస్ఫూర్తితో,కష్టపడి పని చేస్తేనే గుర్తింపు వస్తుందని అని అన్నారు. నేను గత ఐదు సంవత్సరాలుగా ఈ రంగంలో కష్టపడి పని చేస్తున్నాను అని అన్నారు.అందుకే మనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఇషపడి కష్టపడి పని చేస్తే ఏ రంగంలో అయినా ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించవచ్చు అని అన్నారు.బ్యూటిషన్ రంగంలో నన్ను గుర్తించి, ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో నంది అవార్డు ఇచ్చి నన్ను ప్రోత్సహించిన శైలజ రెడ్డి, మౌనిక మేడం లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఇంతకుముందు సంవత్సరం సైమా అవార్డు కూడా అందుకున్నానని తెలిపారు.ఈ రెండు అవార్డులు అందుకోవడం చాలా సంతోషంగా,గౌరవంగా ఉందని ఆమె తెలిపారు

# గడ్డి మందు నిషేధానికి సంపూర్ణ మద్దతు

-ఈటల రాజేందర్
-ఐఎంఏ కార్యాలయంలో సదస్సు
-పారాక్వాట్ నిషేధానికి డిమాండ్
-ఆత్మహత్యలపై ఆందోళన వ్యక్తం



హైదరాబాద్, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ కోటిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో పారాక్వాట్ గడ్డి మందును నిషేధించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సదస్సులో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు కడియం కావ్య, బోయినపల్లి వినోద్ కుమార్, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు హాజరయ్యారు. పెస్టిసైడ్, పెట్రో కెమికల్, ఫార్మాసిటికల్ స్థాయి కమిటీలో సభ్యునిగా ఉన్న ఈటల రాజేందర్ గత సమావేశంలోనే గడ్డి మందు నిషేధం కోరినట్లు తెలిపారు. త్వరలోనే కఠిన చర్యలు ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. గడ్డి మందు తాగిన వారిలో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మాత్రమే కాకుండా, అప్పులబాధ, ఉద్యోగ నష్టం, ఆన్లైన్ గేమింగ్ వంటి కారణాలతో యువత కూడా బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలతో కుటుంబాలు ఆర్థికంగా, భావోద్వేగంగా దెబ్బతింటున్నాయని తెలిపారు.సమాజంలో మానవత్వం కంటే డబ్బు ప్రాధాన్యం పెరిగిందని, రాజకీయాలు పక్కనబెట్టి సమాజాన్ని సరిదిద్దే బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని ఈటల రాజేందర్ అన్నారు. గడ్డి మందు నిషేధం కోసం ఐఎంఏ చేస్తున్న ప్రయత్నాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆలయ భూముల కబ్జాపై గుడివాడ అమర్నాథ్ ఆరోపణలు

-కన్యకాపరమేశ్వరి ఆలయ భూములపై వివాదం
-రూ.100 కోట్ల విలువైన స్థలంపై ప్రశ్నలు
-సీబీఐ విచారణకు డిమాండ్



అనకాపల్లి, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేసే నేతలు కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూములు కబ్జా అవుతున్నప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న కన్యకాపరమేశ్వరి దేవాలయానికి చెందిన భూములు అక్రమంగా బదలాయించారని ఆయన ఆరోపించారు. వందేళ్ల క్రితం దాతలు ఆలయానికి 2 ఎకరాలు 49 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారని, అందులో ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ కోసం కొంత తీసుకోగా ప్రస్తుతం 1 ఎకరా 11 సెంట్ల స్థలం మిగిలి ఉందని తెలిపారు. మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు చెందిన ఈ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే అధికారం అధికారులకు ఎక్కడిదని ఆయన నిలదీశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న స్థలాన్ని ప్రైవేట్ భూమిగా చూపుతూ ఏ ప్రాతిపదికన నివేదిక ఇచ్చారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఒక దొంగల ముఠా ఏర్పడిందని, కూటమి నేతల అండతో ప్రభుత్వ, దేవాదాయ భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు.రూ.100 కోట్ల విలువైన ఈ భూమి ఇప్పటికే కౌలుదారుల పేరు మీదకు మారిందని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై తక్షణమే కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆలయ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# నార్సింగిలో కల్వకుంట్ల కవిత అరెస్టు

హైదరాబాద్, మార్చి 3 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని హైడ్రాను నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు ఆందోళన విరమించబోమని కవిత హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితను పోలీసు వాహనాల్లో ఎక్కించే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు,